# ఫలించని ప్రేమ

రచన:
శ్రీ కె. నూరిబాబు.

పరీక్షలైపోయిన వెంటనే పెట్టె బెడ్డింగు సర్దుకొని మా వూరికి బయలుదేరాను. మా వూరిలో మనుష్యులు, అక్కడ వాతావరణం, గడపవలసిన రోజులు నా మస్తిష్కంలో మెలుగుతూ వుంటూండగా, ఎంత త్వరగా రైల్వేస్టేషన్ చేరుకుందామా అని నా మనస్సు ఉవ్విళ్లూరుచున్నది. సరిగ్గా 9-45 నిమిషములకు మావూరికి ట్రయిన్ వుంది. నేను నాసరంజామాతో 9-30 నిముషములకల్లా స్టేషన్ చేరుకున్నాను. టికెట్టుకొని ప్లాట్ ఫారమ్మీదకు వచ్చి రైలు గురించి చంద్రునికోసం చకోరంలా నిరీక్షిస్తున్నాను. ఇంతలో నేనొచ్చేశాన్రోయి అనుకుంటూ పెద్దకూతచో రైలు ప్లాట్ ఫారమ్ మీదకువచ్చి ఆగింది. మెల్లగా నా పెట్టె బెడ్డింగుతో సహా ఒక థర్డ్ క్లాస్ కంపార్టుమెంటులో చోటు చేసుకునికూర్చున్నాను. చిన్నకూతలో రైలు 'ఎందుకొచ్చిన బాధరా భగవంతుడా' అన్నట్లుగా కదిలింది. అసలు రైల్లో ఏం తోచదనే నేను రెండుమూడు వీక్లీలు నాతోపాటు తీసుకొచ్చాను. అవేగదా ప్రయాణాలలో మనకు ప్రాణ మిత్రులు. మెల్లగా ఒక పుస్తకం తీసి చదవడానికుపక్రమించాను. వెంటనే నా కళ్లు జిగేలు మన్నాయి, నా ఎదురుగుండా ఒక అందమైన అమ్మాయి కూర్చుని నా వైపే చూస్తూంది. ఆ అమ్మాయి కట్టిన నీలం రంగు చీర మీద చిన్నచిన్న పువ్వులు తళతళ మెరుస్తున్నాయి. కోలముఖంతో బంగారు బొమ్మలా వుందా అమ్మాయి. ఆ అమ్మాయి రెండుజాడలలో ఒకటి ముందుకు పడవేసి వుంది. మెడలో ఒంటి పేట గొలుసు ఆ అమ్మాయి అందాన్ని మరింత ద్విగుణీకృతం చేస్తూంది. అదే పనిగా నావైపు కన్నార్పకుండా చూస్తూంది. ఆ అమ్మాయి ప్రక్కన ఒక వయసుచెల్లిన పెద్ద మనిషి కూర్చున్నాడు. బహూశా ఆ అమ్మాయి తండ్రో, బంధువో అయి వుండొచ్చని నా నమ్మకము. నా వైపునుంచి ఆ అమ్మాయి చూపు మరల్చలేదు. అసలెవరైనా అమ్మాయిలు నావైపు చూసినపుడు నేను కూడా ఆ అమ్మాయి కళ్లల్లోకి ఆమె చూపు మరల్చేవరకూ చూడ్డం నాకలవాటయి పోయింది. ఎంత సేపు అలా చూసినా ఆ అమ్మాయి చూపులోని భావం నా కర్థం కాలేదు. ఏమిట్రా యీ అమ్మాయి నా వైపలాచూస్తూంది? కనీసం చూపుతోనైనా తన భావం తెలుపదేమి? అసలు భగవంతుడు మనకు కళ్లను ప్రసాదించడానికి కారణం యీలాంటి సమయాల్లో యువతీ యువకులు తమ భావాలను కళ్ళతో చెప్పుకొనేందుకే ఎందుచేతనంటే వారికి నోటితో చెప్పుకొనే ధైర్యాలుండవు. ఆ చూపుకు భావమేమై యుంటుంది. కొంపతీసి ఆ అమ్మాయి నన్నుగాని ప్రేమించిందా! అయినా అంత అదృష్టమా నాకు ఒక్కసారి ఒళ్ళు జలదరించినట్లయ్యింది. భలే కోపం కూడా వచ్చిందా అమ్మాయి మీద. ఇంత సేపు చూస్తూ ఏ విధంగాను తన మనస్సులో వుద్దేశ్యంగురించి నాకు సైగ చేయదేమి? మెల్లగా నేనే ధైర్యంచేస్తూ 'ఇలారా' అన్నట్టునా తలవూపాను. కానీ ఆ అమ్మాయిలో చలనం లేదు. కనీసం నేచేసిన సంజ్ఞ ఆమె గమనించినట్లుగా ఆమె ముఖంలో భావాలేమీ కనిపించ లేదు. నాకు చాలా ఆశ్చర్యం వేసింది మరలా రమ్మన్నట్టుగా తల వూపాను, అబ్బే! అసలా అమ్మాయి గమనించినట్లుగా లేదు. చ! ఏమిట్రా ఈ అమ్మాయి నాకు భలేగా తయారయ్యింది. ఒక వేళ నన్ను ఫూల్ని చెయ్యదుగదా? ఎంత ప్రయత్నించినా ఆ అమ్మాయి చూపులోని భావం గ్రహించలేక పోయాను.

ఇంతలో ఏదో స్టేషన్ వచ్చింది గాబోలు రైలు మెల్లగా ఆగింది. వెంటనే ఆ అమ్మాయి ప్రక్కనున్న పెద్దమనిషి లేవటంతో ఇదీ వారు దిగవలసిన వూరనుకున్నాను. ఆ పెద్ద మనిషి ఆ అమ్మాయి చేయిపట్టుకొని లేవదీసి 'ఇటురైపమ్మా త్రోవ' అంటూ మెల్లగా నడిపిస్తున్నాడు.

ఆ అమ్మాయి తడుముకుంటూ నడుస్తూంది, నా కనుమానంవేసి ఆ పెద్దమనిషిని అడుగగా ఆయన, 'అమ్మాయికి కళ్లు కనిపించవండి'

అని రఫీమని సమాధానం చెప్పాడు. అయితే మరి నాకు కళ్ళు కనిపించలేదు.

---

అంటూ తినతోడి గుమస్తాను అడుగుతూ అప్పోనిద్దూ ఆడవాళ్లకి ఉద్యోగాలేమిటి పనిరాదు పాడురాదు మనతో సమానంగా ఉద్యోగాలకి,దిగబడతారో అంటూ లెక్చరే ముగించాడు గిరీశం. ఇంతకీ అ పిల్ల అసలు తనతో సరదాగా మాటాడలేదని. ఇలా ఉంటున్నాయి ఆఫీసులు.

మన సమాజంలో స్త్రీ విద్య, స్త్రీ స్వాతంత్ర్యము అంటూనే. నాగరికత అను పేరుతో ముందుకు పోతున్నామో, వెనుకకు వెళ్ళిపోతున్నామో అన్నది ప్రశ్నగానే మిగిలిపోయింది.